01ATP31_01ATP31.qxd 31-03-2026 PM 10:37 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 01 ఏప్రిల్ 2026 పేజీలు : 04

- భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలు
- సగం ధరలకు ఇండక్షన్ గ్యాస్ స్టవ్ ల పంపిణీ
- చెత్తఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోండి
- చెత్త పై పన్నువేసిన చరిత్ర జగన్‌ది మంత్రి సవిత విసుర్లు
- ఆర్డీవో ప్రాంగణంలో స్వచ్ఛ రథాలను ప్రారంభించిన మంత్రి సవిత.

గ్యాస్ పుష్కలంగా ఉంది..నిల్వలపై పుకార్లను నమ్మొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ మార్చి 31 ప్రభాతవార్త

గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత భరోసా ఇచ్చారు. యుద్ధం నేపథ్యంలో భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకూడదనే ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అన్వేషిస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత స్పష్టంచేశారు. పట్టణంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇండక్షన్ స్టవ్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మధ్యప్రాచ్యం యుద్ధం నేపథ్యంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు తగ్గిపోయాయంటూ వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని,అవన్నీ ఒట్టి పుకార్లనని కొట్టిపారేశారు. దేశంలో, రాష్ట్రంలో అవసరమైనన్ని గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. యుద్ధం నేపథ్యంలో భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకూడదనే ప్రత్యామ్నాయ మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్వేషిస్తున్నాయన్నారు. దాంట్లో భాగంగా విద్యుత్ పనిచేసే ఇండక్షన్ స్టవ్ లను సగం ధరకే ప్రజలకు అందిస్తున్నామన్నారు. మార్కెట్ లో ఇండక్షన్ స్టవ్ ధర రూ.4,700లుంటే దానిని రూ.2,400లకే అందజేస్తున్నామన్నారు. జిల్లాకు 15 వేల ఇండక్షన్ స్టవ్ లను కేటాయించగా, పెనుకొండ నియోజక వర్గానికి రెండువేల వరకూ వచ్చాయన్నారు. ఎన్ని ఇండక్షన్ స్టవ్ లు కావాలనుకుంటే, అన్నింటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత తెలిపారు,చెత్తతో సంపద సృష్టించేలా మండలానికో స్వచ్ఛ రథాన్ని

మిగతా 2 లో...

గో ఆల్ అవుట్ అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన పదమే

తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల నిర్మాణానికి కారణం

❖ ఒక సీజన్ లో డ్యాం 33 గేట్లు తొలగించి, కొత్తవి నిర్మించడం దేశంలోనే ఓ రికార్డు ❖ రాయలసీమ రైతుల ప్రయోజనాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
❖ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి ❖ టీబీ డ్యాం గేట్ల పనులను ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులతో కలిసి పరిశీలించిన మంత్రి కేశవ్

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, మార్చి 31 (ప్రభాతవార్త బ్యూరో)

కర్ణాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ గేట్ల నిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తుంగభద్ర బోర్డు అధికారుల తో కలిసి రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా తుంగభద్ర డ్యామ్ గేట్ల మార్పిడి మరియు కాలువల ఆధునీకరణ పనుల పురోగతిని ప్రెస్ మీట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఖిఖిగో ఆల్ అవుట్‌ఖిఖి అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన పదమే తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల నిర్మాణానికి కారణమన్నారు. ఒక సీజన్ లో డ్యాం 33 గేట్లు తొలగించి, కొత్తవి నిర్మించడం దేశంలోనే ఓ రికార్డు అన్నారు. గడువు కంటే ముందే నిర్మాణ సంస్థ పనులు పూర్తి చేయనుందన్నారు. వచ్చే సీజన్ కి డ్యాం 33 గేట్లు అమరిక పూర్తి అవుతుందన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడటానికి ప్రభుత్వం ఎంత వరకు అయినా వెళుతుంది అనడానికి ఇక్కడ జరుగుతున్న పనులు నిదర్శనమన్నారు. గత సీజన్ లో హంద్రీనీవా వెడల్పు పనులు పూర్తి చేసి చూపించామన్నారు. మాటలతో

టీవీ డ్యాం వద్ద కొత్త గేట్లు అమర్చు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఎమ్మెల్యే ఇతర అధికారులు

కాదు చేతులతో పనులు చేసి చూపిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గేట్లు, డ్యాంలు కొట్టుకుపోయినా స్పందించలేదని, టీబీ డ్యాంలో ఒక్క గేటు కొట్టుకుపోతే పారుతున్న నీటికి అడ్డుకట్ట వేసి అప్పట్లో రైతుల ప్రయోజనాలు కాపాడగలిగామని, రాయలసీమ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తుంగభద్ర ఆనకట్టలోని గేట్ల ప్రస్తుత పరిస్థితిపై నిపుణుల కమిటీ మరియు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారని, గత ప్రభుత్వాల హయాంలో గేట్లు సరిగా లేవని నివేదికలు వచ్చినా, వాటిని పట్టించుకోలేదన్నారు. ఒకే సీజన్‌లో పాత గేట్లను తొలగించి, కొత్త గేట్లను తయారు చేసి, వాటిని అమర్చడం ఒక పెద్ద ప్రక్రియ అని, 60 అడుగుల పొడవు గల ఈ గేట్లను రవాణా చేయడం కూడా ఒక సవాలుతో కూడుకున్న

మిగతా 2లో...

అక్రిడిటేషన్ పొందిన మీడియా ప్రతినిధులకు

మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

- మెగా ఉచిత వైద్య శిబిరంలో 236 మందికిపైగా జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు అందజేత
మీడియా మిత్రులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.

జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ, ఆనంద్, ఉచిత వైద్య శిబిరంలో బీపీ చెక్ చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ మార్చి 31 ప్రభాతవార్త

అక్రిడిటేషన్ పొందిన మీడియా ప్రతినిధులకు నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. అనంతపురం కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 07:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ వారి సహకారంతో.. జిల్లా సమాచార మరియు పౌరసంబంధాల శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి.. జిల్లా కలెక్టర్ బీపీ చెకప్ చేయించుకున్నారు. ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం చాలా అవసరమని, ఈ క్రమంలోనే ప్రెస్ మరియు మీడియా మిత్రుల కోసం ప్రత్యేకంగా ఈ ఆరోగ్య తనిఖీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో రెవెన్యూ శాఖ సిబ్బంది కోసం కూడా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రభుత్వ సిబ్బందితో పాటు సమాజంలోని వివిధ వృత్తుల వారికి, జర్నలిస్టులకు వారి ఆరోగ్యంపై, ముఖ్యంగా ప్రివెంటివ్ హెల్త్ కేర్ పై అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్ఓ, జిజిహెచ్, మరియు ప్రభుత్వ వైద్య కళాశాల బృందం, ఎన్టీఆర్ వైద్య సేవ అధికారులు పూర్తి సహకారం అందించారన్నారు. మీడియా మిత్రులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఆయుష్మాన్ భారత్ ఆభా ఐడి లింక్ చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఐ.అండ్.పీఆర్ డిఏపిఆర్ఓ ఏ.బాలకొండయ్య మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య శిబిరంను విజయవంతం చేసిన మీడియా మిత్రులు, వారి కుటుంబ సభ్యులకు, జర్నలిస్టు సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక తోడ్పాటు అందించిన డీఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డా.గంగాధర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. రక్త పరీక్షల అనంతరం స్పెషాలిటీ వైద్యులచే కన్సల్టెన్సీ నిర్వహించి మందులు అందచేయబడ్డాయి. మెగా ఉచిత వైద్య శిబిరంలో 236 మందికిపైగా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. మెగా ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు, ఈసీజీ,2 డి ఎఖో, సి బి పి, ఎల్ ఫ్ టి , ఆర్ ఫ్ టి, లిపిడ్ ప్రొఫైల్, రక్త చక్కెర, ఖాళీ కడుపున , భోజనం తర్వాత, థైరాయిడ్, విటమిన్స్ టెస్ట్,జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్కా ర్డియాలజిస్ట్ , గైనకాలజిస్ట్ ,ఆర్థోపెడిక్, న్యూరో ఫిజీషియన్ ,దంత వైద్యుడు చెవి, ముక్కు, గొంతు,యూరాలజిస్ట్ , వైద్య పరీక్షల రిజల్ట్స్ ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం నుంచి ఐ.అండ్.పీఆర్ డిఏపిఆర్ఓ కార్యాలయంలో అందజేయడం జరుగుతుంది. మెగా ఉచిత వైద్య శిబిరంలో కిమ్స్ సవేరా, పావని, మార్క్ హాస్పిటల్, శ్రీనివాస, చంద్ర, కుమార్ హాస్పిటల్, స్నేహలత హాస్పిటల్, మ్యాగ్నస్ హాస్పిటల్, మమత హాస్పిటల్ వారు భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డా.గంగాధర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఐ.అండ్.పీఆర్ ఏపిఆర్ఓ ఫక్రుద్దీన్, ఐ.అండ్.పీఆర్ పీఆర్ఓ వి.సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్ కార్యాలయం అధికారులు మూర్తి, పురుషోత్తం, జూనియర్ అసిస్టెంట్ రామప్ప, ఐ.అండ్.పీఆర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ప్రభావతి, జూనియర్ అసిస్టెంట్ చాంద్ బాష, టైపిస్టులు దామోదర్ రెడ్డి, దుర్గా సువాసిని, టెక్నీషియన్ కమల్ భాష, డ్రైవర్లు భాస్కర్, ఖాసీం, కార్యాలయం సిబ్బంది రాజారావు, అమ్మని, తాజుద్దీన్, నజీర్, శైలజ, గంగ, దివాకర్, ఆయా ఆస్పత్రుల స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, సిబ్బంది, కలెక్టరేట్, జిల్లా సమాచార మరియు పౌరసంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని తెల్లవారుజామునే ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం మార్చి31 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆసుపత్రిని తెల్లవారు జామున ఐదు గంటలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించడంతో వైద్యులు, సిబ్బంది ఉలిక్కిపడి అప్రమత్తమైయ్యారు. మంగళవాం ఎమ్మెల్యే ఆసుపత్రిలో దాదాపు రెండు గంటల పాటు ప్రతి వారు ్డను సందర్శిస్తూ, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు బాగా చూస్తున్నారా, అడ్మిషన్‌ల కోసం ఎంత సమయం పడుతోం దంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. సేవలపై సంతృప్తి చెందిన ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ కేవలం 560

ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

- ఉలిక్కిపడ్డ వైద్యులు, సిబ్బంది

పడకలకు మాత్రమే వున్నాయని కానీ ఇక్కడ 1200 మందికి ఇన్‌పేషంట్లకు సేవలందిస్తున్నారన్నారు. అలాగే ప్రతి రోజు 2వేల నుంచి 2,500 మంది పేషంట్లు వస్తున్నా, వైద్యులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వైద్యం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొన్నింటికి మందులు లేవని, ఏసిలు పనిచేయలేదని రోగులు ఫిర్యాదు చేశారని, మందులకు ఇండెంట్ పంపాలని, ఏసిల మరమ్మతులతో పాటు కొత్త ఏసిలు కొనుగోలుకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు.

అవినీతి కేసులో గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగభూషణంకు జైలుశిక్ష

అనంతపురం క్రైమ్ మార్చి 31 ప్రభాతవార్త

అవినీతి కేసులో గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగభూషణంకు జైలు శిక్ష విధించినట్లు ఏసీబీ డిఎస్పి ప్రసాద్ రెడ్డి వెల్లడించారు. రాయదుర్గంకు చెందిన ఫిర్యాదుదారుడు కె. అజ్మీత్ 2014 సంవత్సరంలో ఇతర కులానికి చెందిన అనసూయమ్మను ప్రేమించి, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం జిల్లా మొలకల్మూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. 2016 సంవత్సరంలో కులాంతర వివాహాలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.50,000/ ప్రోత్సాహకంగా ఇస్తారని తెలుసుకున్నాడన్నారు. సంబంధిత పత్రాలతో అనంతపురం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడన్నారు. అయితే, అప్పటి అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగభూషణం దరఖాస్తు ప్రాసెస్ చేయడానికి రూ.4,000/ లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడానికి ఇష్టంలేక ఫిర్యాదుదారుడు 26042018 న అనంతపురంలోని ఏసీబీ డిఎస్పీకి ఫిర్యాదు చేశారు. దానిపై క్రైమ్ నంబర్ 04/ఖిదిగితిగిశి/2018 గా కేసు నమోదు చేయబడిందన్నారు. 27042018 న ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి, అనంతపురం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారన్నారు. కేసు విచారణ అనంతరం ఏసీబీ కోర్టు, కర్నూలు న్యాయమూర్తి విద్య మంగళవారం తీర్పును వెలువరించారు. అందులో నిందితుడు శ్రీ నాగభూషణంకు Prevention of Corruption Act, 1988 లోని సెక్షన్ 7 క్రింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష సెక్షన్ 13(2) క్రింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2,00,000/ జరిమానా విధించారన్నారు. అదనంగా, జరిమానా మొత్తం లో నుంచి రూ.1,90,000/ ను ఫిర్యాదుదారునికి నష్టపరిహారంగా చెల్లించాలని గౌరవ న్యాయస్థానం ఆదేశించిందన్నారు. తదుపరి, నిందితుడిని జిల్లా జైలు, కర్నూలుకు తరలించారన్నారు.

పుణ్యకాలం పూర్తి...ప్రయోజనం నాస్తి..!

- నిధులు గుళ్ల..పనులు డొల్ల..! - స్థానిక పాలనలో పెరిగిన పరాయి పెత్తనం
- ఏప్రిల్ 2తో సర్పంచులు, సెప్టెంబరు 24తో ఎంపీటీసీ సభ్యులు ఇంటికి..!

సమన్వయంలేని సర్వసభ్య సమావేశాలు

పెద్దపేటలో ప్రహరీ కూడా లేని ఈ భవనానికి రూ. 2 లక్షల అదనపు ఖర్చుకు ఆమోదం

యాడికి(తాడిపత్రి), మార్చి31, ప్రభాతవార్త

రెవెన్యూ, అభివృద్ధి కార్యక్రమాలను వికేంద్రీకరించడంలో భాగంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలకు, జిల్లా పరిషత్‌లకు మధ్య వారధిగా 1985లో మండల వ్యవస్థ ఏర్పడింది. పరిపాలనా సౌలభ్యం, అభివృద్ధి పథకాలను చేరువ చేయడం, సేవలను వేగవంతం చేయడం కోసం ఏర్పాటు చేసిన మండల వ్యవస్థ క్రమంగా మసక బారుతోంది. మండల వ్యవస్థలో ప్రధాన భూమిక పోషించాల్సిన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ(ఎంపీటీసీ) సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారుతుండటమే ఇందుకు నిదర్శనం. యాడికి మండలంలో 2021లో 16 మంది ఎంపీటీసీ సభ్యులతో ఏర్పడిన పాలక వర్గం పదవీ కాలం ఈ ఏడాది సెప్టెంబరులో ముగియనుంది.16 మంది ఎంపీటీసీ సభ్యులందరూ ప్రతిపక్ష వైకాపాకు చెందిన వారు కావడం, రెండేళ్లుగా అధికారులు తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదనే వాదనలు ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులు వినిపిస్తుండటం, సర్పంచుల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగ్గుండటంతో ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడం వంటి పరిణామాల నేపథ్యంలో స్థానిక సంస్థలపై 'అధికార' పెత్తనం మరింత పెరగనుంది. ఇప్పటికే పంచాయతీ, మండల పరిషత్ నిధుల వినియోగంలో అనధికార పెత్తనం పెరిగి అధికారులు సతమతమవుతున్నారనే విమర్శలు

నిధులు గుళ్ల..పనులు డొల్ల

ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు సర్పంచుల పరిస్థితి కొద్దో గొప్పో బాగున్నా..ఎంపీటీసీ సభ్యుల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైతే అధికార పార్టీ నాయకులే అప్రకటిత ప్రజా ప్రతినిధులుగా చలామణి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సర్పంచులకు చివరిది.. ఎంపీటీసీ సభ్యులకు మరొకటి..!

మండలంలోని 14 మంది సర్పంచులకు నేడు(ఏప్రిల్ 1) జరిగే సర్వసభ్య సమావేశమే చివరిది. ఎంపీటీసీ సభ్యులకు 2026 జులైలో జరిగే సమావేశం చివరిది అవుతుంది. ఈ పాలక వర్గం ఏర్పడిప్పటి నుంచి నేటి వరకు 20 సర్వసభ్య సమావేశాలు, మూడు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. అధికారులు తమకు తగిన గౌరవం ఇవ్వడం లేదని, నిధుల వినియోగంలో తమ ప్రమేయం లేకుండానే ఖర్చు చేస్తున్నారని తరచూ సభ్యులు పలు సమావేశాల్లో ఆరోపిస్తూ రావడం, అధికారులు దాటవేయడం పరిపాటిగా మారింది. కనీసం తమకు వేతనాలు కూడా సాధించుకోలేని దీనావస్థలో ఉన్నామని వాపోయే పరిస్థితి ఎంపీటీసీ సభ్యులకు దాపురించింది. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే వినే అధికారులే తప్ప పరిష్కారానికి చొరవ చూపిన దాఖలాలు లేవని

మిగతా 2 లో...

నేటి బంగారు కుటుంబాలే... రేపటి మార్గదర్శకులు కావాలి

- పీ4 వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకాంక్ష
- మార్గదర్శులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే సునీత
- ఎంత సంపాదించాం అన్నది కాదు.. ఎంతమందికి సాయం చేశామన్నదే ముఖ్యమన్న సునీత
- పీ4 కార్యక్రమంలో మరికొంతమంది ముందుకు రావాలని పిలుపు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, మార్చి 31 ప్రభాతవార్త

నేడు బంగారు కుటుంబాలుగా ఉన్నవారే రేపు మార్గదర్శకులుగా మరికొన్ని కుటుంబాలను దత్తత తీసుకొనే స్థాయికి రావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకాంక్షించారు. రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పీ4 వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంకి ఏడాది పూర్తయిన సందర్భంగా మార్గదర్శకులు బంగారు కుటుంబాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారితో పరస్పరం చర్చించుకునే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మార్గదర్శకులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఘనంగా సత్కారం చేశారు. వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు గురించి అందరికీ వివరించారు. పీ4 మార్గదర్శి పాటిబండ్ల ప్రభాకర్ ఆత్మకూరు మండలం ననప గ్రామానికి చెందిన భవాని ప్రసాద్ అనే విద్యార్థికి లాప్ టాప్‌ను ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం ప్రారంభించినప్పుడు.. తమకు కూడా పూర్తి స్థాయిలో అర్థం కాలేదన్నారు. కానీ ఆయన ఒక మంచి సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమంతో ఏడాదిలో ఎన్నో మంచి ఫలితాలు చూపించారన్నారు. సుమారుగా 10 లక్షల మందికి పైగా కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. పీ4 కార్యక్రమం అంటే పేద కుటుంబాలకు డబ్బులు ఇవ్వడం కాదని.. ఆ కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానానికి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. పిల్లలకి అవసరమైన చదువులు, వారి కుటుంబ స్థితిగతులు మార్చడం, ఉద్యోగాలు వచ్చేలా సహకరించడం, వ్యవసాయంలో సహకారం

మిగతా 2 లో...

మాంచూ ఫెర్రర్ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలిసిన పల్లె కుటుంబసభ్యులు

పల్లె సింధూర రెడ్డిని అభినందించిన ఆర్‌డిటి సంస్థ ప్రతినిధులు

అన్ని ఫెర్రర్ ను సన్మానిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తదితరులు

అనంతపురం, మార్చి 31, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలు గొప్ప వరమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పీపీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డిలు కొనియాడారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ వచ్చిన తర్వాత మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పీపీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి లు అనంతపురం లోని ఆర్‌డిటి కార్యాలయానికి వెళ్లి మంచు కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌డిటి కి ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు అయినందుకు వారు ప్రత్యేకంగా అభినందించి ఆర్డిటి ఫౌండర్

మిగతా 2 లో...

గుడిబండ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహశీల్దారు శ్రీధర్

గుడిబండ మార్చి 31 ప్రభాతవార్త

మండల తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.ఎస్. రాయపురం గ్రామానికి చెందిన ఒక రైతు పేరిట వన్‌బి నమోదు చేయడానికి తహశీల్దారు శ్రీధర్ 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కొంకల్లు గ్రామ పంచాయతీ కి సంబంధించి 272/5 సర్వే నెంబర్ లో 2 ఎకరాల 33 సెంట్లు భూమిని ఒన్ బి చేయడానికి లంచం అడగడంతో రైతు సాబ్జాన్ కుమారుడు సద్దాం ఎసిబి అధికారులను ఆశ్రయించారు.దీంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు పక్కా ప్రణాళికతో తహశీల్దారు శ్రీధర్ లంచం తీసుకుంటుండగా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై ఏసీబీ డిఎస్పీ ప్రసాద్ రెడ్డి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో ఎసిబి డిఎస్పీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు చేయడానికి ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

02ATP27_02ATP27.qxd 31-03-2026 PM 10:35 Page 1

బీసీల పక్షపాతి కూటమి ప్రభుత్వం

యాదవ కళ్యాణ మండపం కోసం47 సెంట్ల స్థలం కేటాయింపు

స్థలం పత్రాలు అందజేసిన మంత్రి సవిత, ఆర్డీవో ఆనంద్ కుమార్

యాదవ్ కళ్యాణమండపం స్థలం పత్రాలు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ మార్చి 31 ప్రభాతవార్త

పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండల కేంద్రంలో యాదవ సంఘం సభ్యుల దీర్ఘకాలిక అభ్యర్థనకు స్పందిస్తూ రాష్ట్ర మంత్రి సవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. యాదవ కళ్యాణ మండపం నిర్మాణం కోసం 47 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ

మాట్లాడుతున్న మంత్రి సవిత

చర్యలు చేపట్టారు. పెనుకొండలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం మంత్రి సవిత ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను యాదవ సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ, తమ అభ్యర్థనను వెంటనే పరిష్కరించినందుకు మంత్రి సవిత కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, యాదవ సంఘం నాయకులు దేవనరసింహప్ప, జిల్లా యాదవ సంఘం నాయకులు లక్ష్మీ నరసప్ప, పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సంస్థ కోసం కృషి చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు దివ్యాంగుల సన్మానం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును దివ్యాంగులు సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, మార్చి 31 ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా ప్రజలతో పాటు దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ సాధించేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేసిన కృషిని దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ప్రశంసించారు. ప్రజా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు ఉద్దీప్ సింహ, నాగమణి, రేణుక మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి, మంత్రులు, ఎంపీలు మరియు కేంద్ర మంత్రుల సహకారంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను పలుమార్లు సంప్రదించి ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ సాధించడంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాము, బండి గోపాల్, దుర్గేష్, నాగరాజు, వడ్డే గోపి, బాలు, రవి, ఆంజనేయులు, తిప్పమ్మ పాల్గొన్నారు.

పౌరుల హక్కులు కాపాడడమే తమ బాధ్యత తహసిల్దార్ సుమతి

బ్రహ్మసముద్రం మార్చి 31 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసిల్దార్

బ్రహ్మసముద్రం మండలంలోని ఎరడీకెర గ్రామం నందు పౌర హక్కుల దినోత్సవం తహసిల్దార్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో ప్రతినెల చివరి రోజు వారి సమస్యలను తెలుసుకొని నివేదించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు అలాగే ఎస్సీ కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురండి అని ప్రజలను అడగగా వారు డ్రైనేజీ సమస్య కరెంటు సమస్య తెలిపారు వీటిని తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మార్వో తెలిపారు అలాగే హెచ్ డబ్ల్యు ఓ మాట్లాడుతూ ప్రజల ప్రభుత్వం పేదవారికి వసతి గృహ సౌకర్యాలు కల్పించడంతోపాటు వారికి చదువు కూడా నేర్పిస్తుందని అందుకు వసతిగృహాలు మరియు నియోజకవర్గ స్థాయిలో కళాశాల వసతి గృహాలు ఉన్నాయి కాబట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్ విఆర్వో పంచాయతీ సెక్రెటరీ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

ఉపాధి హామీలో బిల్లులు చెల్లించలేదని రైతు ఆవేదన

కంబదూరు , మార్చి 31, ప్రభాత వార్త

మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీఐ జాకీ, బాధిత రైతు

ఉపాధి హామీ కింద పెంచుతున్న మామిడి తోటకు మూడేళ్ల నుంచి బిల్లులు అందడం లేదని కంబదూరు మండలం వైసీపల్లి గ్రామానికి చెందిన గాజుల సుధాకర్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు సమాచార హక్కు చట్టం కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఉపాధి హామీ ఏపీవో శ్రీదేవి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మామిడి చెట్ల పెంపకానికి సంబంధించి రావాల్సిన బిల్లులు చెల్లించలేదని అధికారులకు వివరించారు. ఉపాధి హామీ పాత బిల్లులకు సంబంధించి గడువు ముగియడంతో ఏమి చేయలేమని ఏపీవో తెలిపినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా కుందుర్పి ఆర్టీఐ మండల సెక్రెటరీ జాకీ మాట్లాడుతూ 2019 సంవత్సరంలో బాధిత రైతు గాజుల సుధాకర్ తనకున్న పొలంలో మూడు వందలకు పైగా మామిడి చెట్లను పెంచుకోగా ఇప్పటివరకు రూ.82 వేలు మాత్రమే బిల్లు జమైందని అన్నారు. మిగిలిన బిల్లులు ఇప్పటివరకు జమ కాలేదని మండిపడ్డారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రైతుకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ గౌరవ అధ్యక్షులు గోపాల్, ఆర్టీఐ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యురాలు నాగమణి పాల్గొన్నారు.

పుణ్య కాలం పూర్తి...ప్రయోజనం నాస్తి..!



రూ.7 లక్షల ఉపాధి, ఐసీడీఎస్ నిధులతో నిర్మించిన భవనానికి రూ.2 లక్షల అదనపు ఖర్చుకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి... పలువురు సభ్యులు ప్రతిసారీ గళమెత్తేవారు. పుణ్య కాలం పూర్తయినా ప్రయోజనం లేకుండా పోయిం దని ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా నిరాశ వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది. తమ ఐదేళ్ల పదవీ కాలంలో

తమకు కంఠశోషే మిగిలిందంటున్న ప్రజా ప్రతినిధులు

సర్పంచులైనా తమ పంచాయతీల పరిధిలో కొన్ని గుర్తించుకోదగ్గ పనులైనా చేశారేమో గాని, ఎంపీటీసీ సభ్యులు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మినహా చెప్పుకోదగ్గవి ఏమీ లేవనేది అందరికీ తెలిసిన విషయమే.

:నిధుల ఖర్చుపై నీలినీడలు..!

ఈ 20 సర్వసభ్య, మూడు ప్రత్యేక సమావేశాల్లో రూ.10.71 కోట్ల మండల పరిషత్ నిధుల ఖర్చుకు తీర్మానాలు ఆమోదించారు. వీటిలో ప్రధానంగా పెద్దపేట-(యాడికి-చందన) లింకు రోడ్డు ఏర్పాటుకు రూ. 19.20 లక్షలు, అప్పటికే ఉపాధి హామీ, ఐసీడీఎస్ నిధులతో పెద్దపేటలో నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి మరో రూ. 2 లక్షలు అదనపు నిధుల కేటాయింపుకు, ఎంపీడీవో కార్యాలయ మరమ్మతులకు, విద్యుదీకరణకు 5 విడతల్లో రూ. 8 లక్షల ఖర్చుకు, యాడికిలో డ్రైనేజీ సీసీ రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ. 3 కోట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులకు రూ. 36 లక్షలు, టి.కొత్తపల్లి నుంచి రాయలచెరువుకు కంటికి కనిపించని మట్టి రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, కూర్మాజిపేట నుంచి రాయలచెరువుకు లేని మట్టిరోడ్డు నిర్మాణానికి రూ. 5 లక్షలు, సి. లక్షుంపల్లి నుంచి బోయవాండ్ల పల్లికి వేయని మట్టి రోడ్డుకు రూ. 5 లక్షలు ఖర్చుకు తీర్మానాలు చేయడం, ఆమోదించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా ఈ నిధులు ఖర్చు చేశారనే వాదనలు వినిపిస్తున్నా..ఇందులో తీర్మాణాలు ఆమోదించినట్లు సంతకాలు చేయడంలో వారి పాత్ర లేదని ఎలా చెబుతారు అంటూ మరో వాదన రేకెత్తుతోంది. రూ. కోట్లాది రూపాయలు ఉపాధి నిధులు, సాధారణ నిధులు, మండల పరిషత్ నిధులు దుర్వినియోగం అయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఒత్తిళ్లకు తాళలేక అడ్డదిడ్డంగా పనులను ఆమోదిస్తూ నిధుల దుర్వినియోగానికి సహకరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల పంచాయతీ, మండల పరిషత్ నిధులు వినియోగంలో ప్రజా ప్రతినిధులు నిమిత్తమాత్రులుగా మారిపోయారని, పరాయి పెత్తనం పెరిగిపోయిందనే ఆరోపణలు జోరందుకున్నాయి. సహచట్టం ద్వారా సమాచారం సేకరించి నిధుల దుర్వినియోగంలో బాధ్యులైన అధికారులపై చర్యలకు ఉన్నత స్థాయిలో ఫిర్యాదు చేయడానికి కొందరు ఉద్యుక్తులవుతున్నట్లు తెలుస్తోంది.

నేటి బంగారు కుటుంబాలే... రేపటి మార్గదర్శకులు కావాలి

మార్గదర్శిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మొదటిపేజీ తరువాయి...అందించడం ఇలాంటి అనేక కార్యక్రమాలు చేయవచ్చన్నారు. నేడు బంగారు కుటుంబాలుగా ఉన్నవారు భవిష్యత్తులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని.. వారు కూడా మార్గదర్శకులు కావాలని ఆమె ఆకాంక్షించారు. రాప్తాడు నియోజకవర్గంలో మరికొంతమంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అదే విధంగా తాము సాయం చేసేటప్పుడు కొంతమంది ముందుకు వస్తున్నారని... వీరంతా పీ4 కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకునే మహిళలకు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సుధాకర్ నాయుడు సాయం చేసేందుకు ముందుకు వచ్చారని అభినందించారు. పీ4 కార్యక్రమం అన్నది ఇప్పటికిప్పుడు ఏదో మార్పు చూపించే కార్యక్రమం కాదని.. 2047సంకి పేదరికం లేకుండా చేయాలన్న లక్ష్యంతో సాగుతున్న యజ్ఞం అని ఎమ్మెల్యే సునీత అన్నారు.

చనిపోయిన టిడిపి కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం :

ఒక కార్యకర్త మరణిస్తే ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇటీవల ప్రమాదాల్లో చనిపోయిన టిడిపి కార్యకర్తల కుటుంబాలకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత 15లక్షల రూపాయలకు సంబంధించిన బీమా పత్రాలను అందజేశారు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన కృష్ణనాయక్ గత ఏడాది ఏప్రిల్ నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు కు చెందిన గోగుల నారాయణస్వామి రాప్తాడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. రాప్తాడు మండలం బండమీద పల్లికి చెందిన మాధవయ్య గత ఏడాది మార్చిలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ముగ్గురికి టిడిపి సభ్యత్వాలు ఉండటంతో ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు ప్రకారం 15లక్షల ప్రమాద బీమా మంజూరైంది. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన ఈ బీమా పత్రాలను రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత బాధిత కుటుంబ సభ్యులకి అందజేశారు. దేశంలో ఒక కార్యకర్త చనిపోతే ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవవల్లే ఇలాంటి సాయం టిడిపి కార్యకర్తల కుటుంబాలకు జరుగుతోందని అన్నారు.

ప్రజలు పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

బుక్కపట్నం, మార్చి 31, ప్రభాతవార్త

ప్రజలు సమాజంలో పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని తాసిల్దార్ నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం బుక్కపట్నం మండలం మదిరే బైలు గ్రామంలో యస్. సి కాలనీ ఆర్ డి టి స్కూల్ నందు తహసీల్దార్ నరసింహులు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంటరానితనంఅమానుషం, రెండు గ్లాసుల పద్ధతి, అందరికి విద్య,బాండెడ్ లేబర్స్, యస్ సి యస్ టి అట్రాసిటి చట్టం పై అవగాహన, స్త్రీ శక్తి యాప్, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వంటి వాటి గురించి వివరించారు. వాట్సాప్ గవర్నన్స్ గురించి తెలపడమైనది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, వి. ఆర్ ఓ లు రామమోహన్, నరేష్, డీ. వి. యం. సి మెంబర్స్ యస్. రామాంజినేయులు, పైపల్లి గంగాధర్, అంగన్వాడీ టీచర్స్ మరియు యస్ సి ప్రజలు పాల్గొన్నారు.

గో ఆల్ అవుట్ అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన పదమే తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల నిర్మాణానికి కారణం

టీబీ డ్యాం ఫోటోలు

మొదటిపేజీ తరువాయి...పని అన్నారు. గేట్ల పునరుద్ధరణ విషయంలో నిపుణులు కన్నయ్య నాయుడు వంటి నిపుణుల సలహాలను తీసుకున్నామని, సి.డబ్ల్యు.సి మరియు ఇతర నిపుణుల కమిటీలు కూడా ఈ ప్రక్రియలో భాగమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "గో ఆల్ అవుట్" అని ఆదేశిస్తూ, రైతు ప్రయోజనాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోమని చెప్పారని, కర్నాటక ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, తగిన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మొత్తం 33 గేట్లను మార్చాలని నిర్ణయించుకోగా, ప్రస్తుతం కొన్ని గేట్ల పనులు పూర్తి కావచ్చాయని, డ్యామ్ వద్ద మొత్తం 18 గేట్లను విజయవంతంగా అమర్చారని, ప్రస్తుతం వెల్డింగ్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. పనులను మే నెల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, పనుల వేగం చూస్తుంటే అంతకంటే ముందే పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి చిన్న అంశాన్ని (బాటమ్ గార్డర్, మిడిల్ గార్డర్, టాప్ గార్డర్, స్కిన్ ప్లేట్ మరియు రబ్బర్ సీల్స్) క్షుణ్ణంగా మానిటర్ చేస్తూ, పక్కా ప్రణాళికతో పనులు జరుపుతున్నారన్నారు. 201419 మధ్య కాలంలోనే ఈ పనుల కోసం ప్రయత్నాలు జరిగాయిని, అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, సిద్ధరామయ్య (కర్ణాటక) మధ్య జరిగిన చర్చల ఫలితంగా, ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా ఆధునీకరణ చేయడానికి అంగీకారం కుదిరిందన్నారు. కాలువల ఆధునీకరణలో కర్ణాటక బోర్డర్ పరిధిలోని కిలోమీటర్లను ఆధునీకరించారని, 37వ కిలోమీటర్ వద్ద ఉన్న టన్నెల్ లో పేరుకుపోయిన అడ్డంకులను తొలగించి, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ గేట్ల మార్పిడి వల్ల రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, రైతులకు నమ్మకాన్ని కలిగించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గేట్లతో పాటు పాత చైన్లను కూడా మార్చాలని అధికారులు నిర్ణయించారన్నారు. తొమ్మిది గేట్లు 100 శాతం వెల్డింగ్ పూర్తి చేసుకున్నాయని, మరో తొమ్మిది గేట్లు కూడా త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. ఈ 33 గేట్లు అన్నీ పూర్తి చేసి మే నెల కల్లా నీళ్లు నిల్వ చేసేలా చూస్తామన్నారు. డ్యాం గేట్లు మరియు చైన్లను కూడా మార్చమని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గేట్ల పనులు మే నెలలోగా పూర్తి చేసి, వచ్చే వర్షాకాలం నాటికి రైతుల నమ్మకాన్ని నిలబెడతామన్నారు. పనులు జరుగుతున్నాయా లేదా అని అధికారులను ఫోటోలు పంపమని అడిగి, నిరంతరం పర్యవేక్షించినట్లు చెప్పారు. హంద్రీనీవా వెడల్పు పనుల కంటే ఈ గేట్ల విషయంలో ఎక్కువ భయం ఉండిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రోత్సాహం, మంత్రి రామానాయుడు గారి మద్దతు మరియు కర్ణాటక ప్రభుత్వ సహకారాన్ని కొనియాడారు. సంబంధిత అధికారులు చాలా కష్టపడి పనిచేశారని, రిజల్ట్ కనిపిస్తోందని మెచ్చుకున్నారు. అయితే పనులు పూర్తిగా పూర్తయ్యాకే క్రెడిట్ తీసుకుందామని అధికారులతో చెప్పినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత టెక్నికల్ కమిటీ వచ్చి అప్రూవల్ ఇస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ "చాలా సంతోషకరమైన శుభ సమయం ఇది అన్నారు. 1958లో తొలిసారి క్రస్ట్ గేట్లు ఆపరేట్ చేసి నీళ్ల వదిలిన సమయం నుంచి తన శక్తికి మించి సామర్థ్యానికి మించి సేవలందించిన గేట్లు ఈరోజు తుప్పు పట్టిపోయి శిథిల దశకు చేరుకున్న సందర్భంలో వాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం అనేది చాలా పెద్ద కసరత్తు అని అన్నారు.

మాంచూ ఫెర్రర్ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలిసిన పల్లె కుటుంబసభ్యులు



ఆర్డిటి ముఖ్యులతో మాట్లాడుతున్న శ్రీ బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి

మొదటిపేజీ తరు వాయి...అన్నే ఫెర్రర్ ,ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ , మహిళా సాధికారిక డైరెక్టర్ విశాల ఫెర్రర్ కు పల్లె కుటుంబ సభ్యులు పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్ డి టి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు గొప్ప వరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆర్డిటి సంస్థ ఫౌండర్ అన్నే ఫెర్రర్ ,ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్,విశాల్ ఫెర్రర్ మాట్లాడుతూ, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆర్డిటి ఎదుర్కొంటున్న సమస్యను అసెంబ్లీలో తొలిసారిగా మాట్లాడిన తీరు ఎంతో అద్భుతంగా మమ్మల్ని ఆకట్టుకుందని ఆ మేలు మేము ఎన్నటికీ మర్చిపోలేము అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్డిటి సమస్య ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ బాబు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా మాట్లాడి ఆర్ డి టి కి కేంద్రం నుంచి ఎఫ్ సి ఆర్ ఏ మంజూరయ్యేలా కృషి చేసినందుకు పల్లె కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాయాన్ని జీవితంలో మర్చిపోలేని ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని తెలిపారు. . ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ కుటుంబ సభ్యులను కలిసిన వారిలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు పీవీకే కే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పుష్కలంగా ఉంది నిల్వలపై పుకార్లను నమ్మొద్దు



ఇండక్షన్ గ్యాస్ స్టవ్ లను పంపిణీ చేస్తున్న మంత్రి

మొదటిపేజీ తరు వాయి...రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఊళ్లలోకి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు ఇంట్లో ఉన్న పనికిరాని ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గాజు సీసాలు, పేపర్లు, పాత పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వస్తువులను ఈ రథానికి ఇచ్చి, వాటికి బదులుగా నిత్యావసర సరుకులను ప్రజలు పొందవచ్చునన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అదే చెత్తపై పన్నులు వేసి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. అంతకుముందు ఇండక్షన్ స్టవ్ మేళా సందర్భంగా కొందరు లబ్ధిదారులకు ఇండక్షన్ స్టవ్ లను పంపిణీ చేశారు. మూడు స్వచ్ఛ రథాలను మంత్రి సవిత జెండా ఊపి ప్రారంభించారు. చెత్త తోపుడు బండ్లను పారిశుధ్య సిబ్బందికి మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్ , రాష్ట్ర సగరపుర ఛైర్మన్ వెంకటరమణ, జిల్లా పౌర సరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, పెనుకొండ డివిజన్ సహాయ పౌరసరఫరాల అధికారి రమేష్, తహసీల్దార్ స్వాతి , రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేఖర్, స్వచ్ఛందర కార్పొరేషన్ రెడ్డివారి మంజునాథ్, డీఎల్ డిఓ రామకృష్ణ, ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు, పెనుకొండ అర్బన్ కన్వీనర్ శ్రీరాములు , పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు రమణమ్మ,పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏప్రిల్ 11, 12, 13 తేదీల్లో అనంతపురం నుండి బండ్లపల్లికు పాదయాత్ర

-13న జరిగే బహిరంగ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా -సూపర్-6 హామీలు అమలు చేసి ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగాలి-టిడ్కో ఇళ్ల లబ్దిదారుల వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి-విలేఖరుల సమావేశంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి

ఉరవకొండ, మార్చి 31 ప్రభాతవార్త

ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వీబీ జీరామ్ జీకి అంటూ పేరు మార్చి కేవలం పథకంగా చేసి కూలీలకు అన్యాయం, చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని దీనికి వ్యతిరేకంగా ఏప్రిల్ 11, 12, 13 తేదీల్లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం నుంచి ఉపాధి హామీ పథకం ప్రారంభమైన బండ్లపల్లి వరకు పాదయాత్ర చేపడుతున్నామని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి తెలిపారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పి.నారాయణస్వామి మాట్లాడుతూ పాదయాత్ర ముగింపురోజు జరిగే బహిరంగ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, కె.నారాయణ, పల్లా వెంకటరెడ్డి ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత కూలీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్‌ను నిర్వీర్యంచేసే యోచనతోనే వీబీ జీరామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చి ఈ ఏప్రిల్ నుండి అమలు చేయబోతున్నారన్నారు. యుపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీల ఒత్తిడితో నాడు ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ పథకం బండ్లపల్లి నుంచి ప్రారంభంకాగా కూలీలకు 100 రోజుల పని గ్యారెంటీ లభించిందన్నారు. పథకానికి కేంద్ర ప్రభుత్వం 90శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10శాతం నిధులు కేటాయించేలా చట్టం అమలైందన్నారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం నేడు చట్టం రూపురేఖలు మార్చేసి కూలీలకు అన్యాయం చేస్తూ కేంద్రం ద్వారా కేవలం 60శాతం మాత్రమే నిధులు ఇచ్చేలా మిగిలిన 40శాతం నిధులు రాష్ట్రాలే భరించేలా భారీ మార్పులు చేసి గాంధీ పేరును సైతం తొలించి కూలీల కడుపుకొట్టేందుకు సిద్ధమైందన్నారు. ఈ దుర్మార్గంపై బీజేపీ మిత్రపక్షమైన టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపకపోవడం సరైంది కాదన్నారు.

ఎన్నికల ప్రధాన అజెండా అధికారమే అన్నట్లు ఐదు రాష్ట్రాల ఎన్నికలు:

త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అధికారంలోకి రావడమే పరమావధిగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వ్యవహరిస్తోందని ప్రజలు, ప్రజా సమస్యల పరిష్కారం ఊసే లేకుండా పోతోందని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి వాపోయారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక అసెంబ్లీ పెట్టిమరీ అమరావతిను రాజధానిగా తీర్మాణంచేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతున్నారని రాజధాని అమరావతిలో ఉన్నా లేక విశాఖ, కర్నూల్‌లో ఉన్నా పరిపాలన సౌలభ్యం కోసమేనన్నది పాలకులు గుర్తించాలన్నారు. అధికారంలోకి రాకముందు కూటమి పెద్దలు ఇచ్చిన సూపర్-6 హామీల్లో ప్రధానమైన జాబ్ క్యాలెండర్, 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి, 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల మహిళలకు నెలకు 1,500 రూపాయలు సాయం అందిస్తామన్నారని వాటి అమలు ఎప్పుడో చెప్పిన తరువాతే స్థానిక ఎన్నికల్లో ఓటు అడగాలన్నారు. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్దిదారులు రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారు, ఎన్ని ఇళ్లు నిర్మించారు, ఎంత డబ్బులు కట్టించుకున్నారన్న వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.కేశవరెడ్డి, తాలుకా కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, సహాయ కార్యదర్శులు డి.సుల్తాన్, నాగేంద్ర, మండల కార్యదర్శి గన్నె మోహన్, సీనియర్ నాయకులు మల్లికార్జున, రామాంజినేయులు, గెన్నె మల్లేసి, శ్రీధర్, ఖాజీంధర్, బసవరాజు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూరాకులపల్లిలో తాగునీటి సమస్యపై సిపిఐ ఆధ్వర్యంలో గ్రామస్తుల ధర్నా

- ఆర్డీవో కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన

ఆర్డీఓ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కళ్యాణదుర్గం, మార్చి 31 ప్రభాతవార్త

వేసవి ప్రారంభం కాకముందే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తూ కళ్యాణదుర్గం శివారు ప్రాంతమైన కూరాకులతోట కాలనీ వాసులు మంగళవారం ధర్నాకు దిగారు. సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ప్రస్తుతం సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అయితే కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఒక బోరు పూర్తిగా మట్టితో నిండిపోయి పనిచేయ డం లేదని, మరో బోరులో నీరు రాక ప్రజలు బిందెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో చిరుతలు, ఎలుగుబంట్లు, పాములు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే వీధి లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కులాయి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ పనుల పురోగతి ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి కూరాకులతోట కాలనీలో స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించి మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు బుడెన్, సనావుల్లా, నాయకులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్.డి.టి. సంస్థ సేవలు కలకాలం కొనసాగాలి

విన్సెంట్ ఫెర్రర్ ఆశయాల బాటలో నడుస్తున్న మంచు ఫెర్రర్ ను ప్రశంసించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

మంచోఫెర్రర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

శింగనమల మార్చి 31 ప్రభాతవార్త

ఆర్.డి.టి. సంస్థ ఎఫ్.సి.ఆర్.ఎ. ను కేంద్ర ప్రభుత్వం రెన్యూవల్ చేసిన నేపథ్యంలో సంస్థ కార్యాలయంలో ఆర్.డి.టి. ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచ్ ఫెర్రర్ ని, ఆర్.డి.టి. మహిళా సాధికారత అధ్యక్షులు విశాలఫెర్రర్ నిమంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ,ఎడిసిసి బ్యాంకు చైర్మన్ కేశవ రెడ్డి, పుట్లూరుమండల కన్వీనర్ శ్రీనివాసులు, అనంతపురం జిల్లా టీడీపీ నాయకులు శ్రీధర్ బాబు,జిసి బాబు,రమణ క్యాటరింగ్స్ యజమాని కొప్పల వెంకటరమణ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ సేవలు కలకాలం కొనసాగాలని పేర్కొన్నారు. అలాగే మహనీయులు విన్సెంట్ ఫెర్రర్ ఆశయాల బాటలో నడుస్తున్న మంచ్ ఫెర్రర్ ని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రశంసించారు. వెనకబడి ఉన్న అనంతపురం జిల్లాలో ఆర్డిటి సంస్థ చేపట్టిన కార్యక్రమాలు సేవలు చాలా అమోఘమైనవని, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ లకు విద్య, ఆర్థిక అభివృద్ధిలో అందించిన సేవలు గొప్పవని పేర్కొన్నారు. అలాగే కుల మతాలకు సంబంధం లేకుండా ప్రజలందరికీ ఆర్డిటి ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందజేయడం పట్ల జిల్లా వాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

వైయస్ జగన్ కలిసిన న్యాయవాది పేరూరు నాగిరెడ్డి

వైఎస్.జగన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో

వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ప్రముఖ న్యాయవాది వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరూరు నాగిరెడ్డి కలిశారు. ఆయన మంగళవారం తాడేపల్లి నందు వైయస్ జగన్మోహన్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వైయస్ జగన్‌ను శాలువాతో సన్మానించారు. న్యాయవాది నాగిరెడ్డి వెంట ధర్మవరం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఇతర నాయకులు కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం వారితో వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ భవిష్యత్తు మరియు పార్టీ కార్యక్రమాలు కార్యాచరణ లపై వారితో ముచ్చటించారు. రాబోయేది మన ప్రభుత్వమేనని అందుకోసం ప్రతి ఒక్కరు కష్టపడి పార్టీ శ్రేణులతో కలిసి పని చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. అందుకోసం మేమంతా సిద్ధంగా ఉన్నామని పార్టీ కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడి పనిచేస్తున్నామని వారు అధినేతకు వివరించారు.

విద్యతోపాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యం

- మెగా వైద్య శిబిరంలో జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

వైద్యులతో మాట్లాడుతున్న జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

అనంతపురం సిటీ, మార్చి 31 ప్రభాతవార్త

విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు వివరించారు. జెఎన్‌టియుఏ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌తోపాటు రిజిస్ట్రార్ కృష్ణయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్య పరీక్ష నిమిత్తం మెగా వైద్య శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ప్రగతి పతం యూత్ అసోషియేషన్ మై భారత్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ తరచుగా ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. మెగా హెల్త్ క్యాంపు ద్వారా అద్భుతంగా వైద్య సేవలను అందేందుకు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మమత, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి చంద్రమోహన్‌రెడ్డి, మైండ్ కేర్ ఆసుపత్రి డాక్టర్ బాలాజీ, ప్రజాదంత వైద్య శాల డా.దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి

- జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, మార్చి 31 ప్రభాతవార్త

పదోన్నతులు పొందిన ఉద్యోగులు అంకిత భావంతో విధులను నిర్వర్తించాలని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ చేతులు మీదుగా అందజేశారు. మోనీసా చారికి ఎంపిపి రొళ్ల, రమణకు ఎంపిపి గుడిబండ, ప్రభాకర్‌కు ఎంపిపి గుత్తి, శ్రీనివాసులుకు ఎంపిపి ముదిగుబ్బలకు ఉత్తర్వులను అందజేశారు. బాధ్యతా యుతంగా ప్రజలకు సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో జడ్పిసిఇఓ సుధాకర్‌రెడ్డి, శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, ఏఓలు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు ఏప్రిల్ 1ని బ్లాక్ డేగా పాటించండి

- ఐఎఫ్‌టియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం

అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో

మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నేతలు

నగరంలో మంగళవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి నాలుగు లేబర్ కోడ్లను అమలు పరచడాన్ని వ్యతిరేకిస్తూ బ్లాక్ డేగా ఏప్రిల్ ఒకటిని పాటించాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు దావిద్ వహించినారు. ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, జిల్లా అధ్యక్షులు యేసు రత్నం, ఐసా విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు వేమన్న, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.వి.నాయుడు, ఎఐటియుసి నగర అధ్యక్షులు చిరంజీవి, వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాజారత్నం, అరుణోదయ జిల్లా నాయకులు చంద్రప్ప, భీమేష్ తదితరులు మాట్లాడుతూ..కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నిర్వీరం చేసి కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడి దారులకు బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడంతో కార్మికులు నేటి నుండి యాజమాన్యానికి కట్టు బానిసలుగా ఉండే పరిస్థితి ఉన్నది. కార్మికులు సమ్మె చేయాలంటే 40 రోజులు ముందు నోటీసిస్తూ అది కూడా యాజమాన్యం అంగీకరిస్తేనే చెయ్యాలి లేకపోతే చేయ కూడదు, యూనియన్ పెట్టుకోవాలంటే మెజార్టీ సభ్యులు ఉంటేనే యూనియన్ ఏర్పాటు చేసుకోవాలి, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, సౌకర్యాలు పొందాలంటే యాజమాన్యాల దయ దక్షిణ మీద ఆధారపడడం, వారానికి 48 గంటలు పని దినాలు అని చెబుతూనే 12 గంటలసేపు పనిచేయించుకోవచ్చానని తెలపడం, లేబర్ అధికారులందరూ చట్టపరమైన అధికారాన్ని కోల్పోవడం దుర్మార్గమైన లేబర్ కోడ్లను తీసుకుని వస్తున్నారని వీటిని కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని అయినా మోడీ ప్రభుత్వం తన నియంతృత్వ ధోరణితో అమలులోనికి తీసుకొని వస్తున్నాడు. ముతో వీటిని కార్మికులు అందరూ వ్యతిరేకిస్తూ టవర్ క్లాక్ దగ్గర ఉదయం 10 గంటలకు రేపు జరగబోయే బ్లాక్ డే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్నామని మాట్లాడడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ శెట్టి, మాబు, ఈశ్వరయ్య, లక్ష్మినారాయణ, రామంజి ఐసా విద్యార్థి సంఘం భీమేష్, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో బ్రాహ్మణులు మాత్రమే పూజలు చేయాలన్న నిబంధన లేదు

- ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర యువజన కార్యదర్శి నాగ విశ్వనాథ్

అనంతపురం కల్చరల్, మార్చి 31 ప్రభాతవార్త

నాగ విశ్వనాథ్

వేదం చదివిన వారు ఎవరైనా దేవాలయాల్లో పూజలు చేయవచ్చు. భారత రాజ్యాంగంలో బ్రాహ్మణులు మాత్రమే దేవాలయాల్లో పూజలు చేయాలన్న నిబంధన ఏమి లేదు. మందకృష్ణ మాదిగ వాల్మీకి రచించిన రామాయణం గురించి ఎవరికీ తెలియదన్నట్టుగా ఇప్పుడు వివరిస్తూ.. బ్రాహ్మణులపై విద్వేషం కక్కడం భావ్యం కాదని, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర యువజన కార్యదర్శి కొత్తచెరువు నాగ విశ్వనాథ్ స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం అయన ఓ ప్రకటన విడుదల చేశారు. వేదం చదివి, పూజారి వృత్తి లోకి రావాలనుకున్న వారికి బ్రాహ్మణులు అడ్డుగా నిలవడం లేదు. అయితే బ్రాహ్మణులు పూజ చేసే వ్యవస్థ రద్దు కావాలని డిమాండ్ చేయడం వెనక ఆంతర్యం ఏమిటి.. బ్రాహ్మణుల అస్థిరత్వాన్ని కాపాడుకునేందుకు మేము ఎక్కడ వెనకడుగు వేసే ప్రసక్తి లేదు. మేము ఏ కులానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూనే.. రాజ్యాంగం మాకు కూడా కల్పించిన హక్కులను వినియోగించుకొని ఇలాంటి వ్యాఖ్యలు అనవసరంగా చేస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని నాగ విశ్వనాథ పునరుద్ఘాటించారు.

సంజీవులు మృతి వైఎస్ఆర్సీపికి తీరనిలోటు

- మాజీ సింగిల్ విండోఅధ్యక్షుడు బొమ్మన శ్రీరామ్‌రెడ్డి

సంజీవులు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న బొమ్మను శ్రీరామ్ రెడ్డి

శింగనమల మార్చి 31 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నమట్ల గొంది గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి విలేజ్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యం. సంజీవులు మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరాంరెడ్డి చిన్న మట్లగొంది గ్రామము లోని ఆయన నివాసానికి వెళ్లి సంజీవులు భౌతికయానికి పూల మాలవేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా బొమ్మన శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ సంజీవులు మృతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట నాగలింగం. సురేష్. ఎస్సీ సెల్ నాయకుడు రాజు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజనేయులు. కుళ్లాయప్ప వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆరు మండలాల సర్పంచుల పదవి విరమణ సన్మాన సభ

అనంతపురం రూరల్, మార్చి 31 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గానికి సంబధించిన ఆరు మండలాల సర్పంచు ల పదవి విరమణ సన్మాన సభ కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరు కావడం జరుగుతుందని ఈ సన్మాన సభ కార్యక్రమం ఉదయం 10:00 గంటలకు అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు లో గల రజాక్ ఫంక్షన్ హాల్ లో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర,జిల్లా నియోజకవర్గ మండల,గ్రామ అనుబంధ విభాగాలు అధ్యక్షులు, మరియు సభ్యులు వై.యస్.ఆర్.సీపీముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ రాప్తాడు వై.యస్.ఆర్.సీపీ కార్యాలయం వారు ఒక ప్రకటన లో తెలిపారు.

గార్లదిన్నెలో 20 మందికి ఆర్‌టీఈ సీట్లు

గార్లదిన్నె, మార్చి 31,ప్రభాతవార్త

ఆర్‌టీఈ 12(1)(సి) కింద 2026-27 విద్యా సంవత్సరానికి లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీ లోగా తమకు కేటాయించిన పాఠ శాలల్లో తప్పనిసరిగా ప్రవేశాలు పొందాలని మండల విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు నమోదు చేసిన మొబైల్ నంబర్లకు ఇప్పటికే సీటు కేటాయింపుపై సమాచారం పంపినట్లు తెలిపారు. సంబంధిత పాఠశాలలో సీటు కేటాయించబడిన విషయంపై సందేహాలు ఉన్నవారు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసు కోవచ్చని సూచించారు.ఇప్పటివరకు గార్లదిన్నె మండలంలో మొత్తం 20 మంది విద్యార్థులకు ఆర్‌టీఈ 12(1)(సి) కింద ప్రవేశాలు కేటాయించబడినట్లు అధికారులు వెల్లడించారు.ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారులుకె. తార చంద్రనాయక్, టీ. వెంకటరమణా నాయక్ లు తెలిపారు.

ప్రైమరీ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష

అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ మార్చి 31 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఇందులో వ్యవసాయ శాఖలో ప్రస్తుతం అములు అవుతున్న పథకాల ప్రగతి గురించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ లో ఇంకా ఎవరైనా రైతులు మిగలి ఉంటే వారిని కూడా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపిఎంఐపి ద్వారా ఇప్పటి వరకు మంజూరైన డ్రిప్ పరికరాలను పంపిణీ చేసి వాటిని ఇన్స్టాలేషన్ చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఆత్మ ద్వారా నూతన సాంకేతిక పద్ధతులను గుర్తించి రైతులకు చేరే విధంగా శిక్షణా కార్యక్రమాలను మరియు చైత్ర ప్రదర్శనను నిర్వహించేలా చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, నాబార్డు ఏజీఎం అనురాధ, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డిసిఓ అరుణ కుమారి, ఆత్మా పీడీ పద్మలత, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్‌రావు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 31 ప్రభాతవార్త

డా.కె.విజయ్

అనంతపురం జిల్లాలో కొత్తగా నియమితులైన 62 మంది కెజిబివి టైప్3, టైప్4 నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించిన 7 నెలల పెండింగ్ వేతనాలు ఎట్టకేలకు మంగళవారం జమ అయ్యాయని, ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సమగ్ర శిక్ష కేజీబీవీ ఉద్యోగుల ఫోరం జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ డా.కె.విజయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఫోరం జేఏసీ నిరంతర ఒత్తిడి ఫలితంగా విడుదల చేసిన బడ్జెట్ ద్వారా ఈ ఉద్యోగుల వేతనాలను ఈఎస్ఐ, ఈపీఎఫ్ కట్ చేయకుండా నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మార్చి నెల జీతాలను ఒక రోజు ముందుగానే విడుదల చేయించినందుకు విద్యాశాఖ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అధైర్య పడకండి అండగా ఉంటాం !

రాప్తాడు, మార్చి 31 ప్రభాతవార్త

నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని బండమీద పల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయ కుడు మాజీ ముఖ్య మంత్రి వర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డిని అభిమా నించే నాయకుడు సూరం నాగిరెడ్డి భార్య అచ్చమ్మ జ్వరంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాలతో మండల కన్వీనర్ వెంకటేష్, యూత్ కన్వీనర్ గొల్లపల్లి విశ్వనాథ్ రెడ్డి, బాధిత కుటుంబాన్ని ప్రకాష్ రెడ్డితో ఫోన్లో పరమాశించి బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పడం జరిగింది కార్యక్రమంలో బండమీదపల్లి వైఎస్ఆర్సిపి నాయకులు బండమీద పల్లి గ్రామ అధ్యక్షుడు వై సోమశేఖర్ రెడ్డి, మాజీ డీలర్ నాగరాజు .మారక నరసింహారెడ్డి వై చంద్రారెడ్డి, వై సాయినాథ్ రెడ్డి, బండమీద పల్లి యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.అనిల్ కుమార్ రెడ్డి, ఎక్స్ వాలంటీర్లు అనిల్, శ్యామ్, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్-డి ఉచిత శిక్షణ దరఖాస్తునకు గడువు పొడిగింపు

అనంతపురం న్యూటౌన్, మార్చి 31 ప్రభాతవార్త

ఆర్ఆర్‌బి రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు గ్రూప్-డి పరీక్షలకు అర్హులైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరణ గడువును ఏప్రిల్ 8వ తేది వరకు పొడిగించినట్లు ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్, అనంతపురం సంచాలకులు ఖుష్బూ కొఠారి ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. అర్హులైన 100 మంది అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్ఆర్‌బి రైల్వే రిక్రూట్ మెంట్ గ్రూప్-డికి ఆన్‌లైన్‌లో అప్లై చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. ఆర్ఆర్‌బి (రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) దరఖాస్తు చేయు అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి ఏప్రిల్ నెల 8వ తేదీలోగా బిసి స్టడీ సర్కిల్, నందు దరఖాస్తు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలోగాని, ఫోన్ నెంబర్లు 9704204905, 9550250770, 8309006875లో సంప్రదించాలని సూచించారు.

పకడ్బందీగా 10 పరీక్షలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 31 ప్రభాతవార్త

10వ తరగతి రెగ్యులర్ పరీక్షలు మార్చి-2026కు సంబంధించి మంగళవారం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి ఎం.ప్రసాద్‌బాబు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. సంస్కృతం పరీక్షకుగాను జిల్లాలో 71 సెంటర్స్‌లలో రెగ్యులర్ అభ్యర్థులు 4688 మందికిగాను 4681 మంది హాజరయ్యారు. అందులో 7 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని హాజరు శాతం 99 శాతం. జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు 03 సెంటర్లను, 4 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 11 సెంటర్లను, అసిస్టెంట్ కమిషనర్ 4 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా మొత్తంలో 18 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు.

స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

-పలువురికి గాయాలు

-ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు

పుట్లూరు, మార్చి 31 ప్రభాతవార్త

పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామంలో స్థలం విషయంలో పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇరువర్గాల వారు సోమవారం రాత్రి ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ సురేంద్రబాబు తెలిపిన మేరకు స్థలం విషయంలో గ్రామంలోని ఒక వర్గానికి పొట్టిపాటి నాగార్జున, తోల్లరాజు, చిల్లు లక్ష్మీదేవి, చిల్లు రాజుతో పాటు మరో వర్గానికి చెందిన శ్రీనివాసులు అలియాస్ దుబాయ్ శీను, కుళ్లాయప్ప, కుళ్లాయప్ప భార్య లక్ష్మీదేవి, శ్రీనివాసులు భార్య మనీ, శ్రీనివాసులు చెల్లెలు లక్ష్మీదేవిలు కర్రలు, రాడ్లతో, కొడవళ్ళతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు వర్గాల వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్క గృహ యజమాని పన్ను చెల్లించాలి

- సిబ్బంది సకాలంలో పన్నులు వసూల్ చేయాలి.

- డి ఎల్ డి ఓ, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ అభివృద్ధి అధికారి.

అనంతపురం రూరల్, మార్చి 31 ప్రభాతవార్త

ప్రజల నుంచి పన్నులు వసూల్ చేస్తున్న అధికారులు

అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ గ్రామ పంచాయతీలో నివసించే ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని డి యల్ డి ఓ నాగశివలీలా, ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, గ్రేడ్ 1 పంచాయతీ అభివృద్ధి అధి కారి హిదయాతుల్లా కోరారు. మంగళవారం వారు పన్ను వసూలు చేసే సిబ్బందితో సమావేశం నిర్వహించి అనం తరం గ్రామం లో ఇంటి పన్నులు చెల్లించని వారి ఇంటి వద్దకు వెళ్లి పన్ను లు చెల్లించాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ ఉన్న పన్నులు ఏప్రిల్ 15 లోపు వసూలు చేయించాలని కమిషనర్, కలెక్టర్ మాకు దేశాలు ఇవ్వడం జరిగిందని వారి ఆదేశాల మేరకు గ్రామంలో ఎవరైనా ఇంకా ఇంటి పన్ను నీటి పన్ను చెల్లించని వారు ఉంటే ఏప్రిల్ 15 లో పు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని గ్రామ ప్రజలకు తెలపలని పన్ను వసూల్ చేసే సిబ్బందితెలియజేశారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న, గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి పనులు చేయడానికి వీలుంటుందని కావున పన్నులు సకాలంలో వసూల్ చేయాలన్నారు. ఇంకా ఎవరైనా ఇంటి, నీటి,ఇతర పనులు చెల్లించకపోతే తప్పకుండా చెల్లించాలని వారు కోరారు.

అభివృద్దే మా లక్ష్యం : ఎంపిడిఓ తేజోష్ణ

- బహిరంగ వేలం ద్వార పెరిగిన ఆదాయం

బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు.

పామిడి, మార్చి 31 ప్రభాతవార్త

అభివృద్దే మా లక్ష్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం నందు 2026-27 సంవత్సరానికి గాను దినసరి మార్కెట్, బస్టాండ్, జంతువధశాల, తాటిఫల సాయముకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. దినసరి మార్కెట్‌ను రూ.2.13 లక్షలకు నరశింహులు, బస్టాండ్ రూ.2.60 లక్షలకు ఆదినారాయణరెడ్డి, జంతువధశాల రూ.3.40 లక్షలకు రవికుమార్ వసూలు చేసుకునే హక్కును దక్కించుకోగా తాటిఫల సాయము వేలంలో ఎవరూ పాల్గొనకపోవటంతో వాయిదా వేయటం జరిగిందని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా ఎంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ గ్రామపంచాయతీకి ఆధాయ వనరులను సమకూరుస్తూనే ప్రజలకు మెరుగైన సేవలను అందించటానికి కృషి చేస్తూ ప్రజాభ్యున్నతిని ఆకాంక్షిస్తూ ముందుకెళ్తున్నామని తెలియజేశారు. డిప్యూటీ ఎంపిడిఓ అశ్వర్థమనాయుడు మాట్లాడుతూ దినసరి మార్కెట్, బస్టాండ్, జంతువధశాల వసూలు హక్కును పొందేందుకు జరిగిన వేలం పాటలో గత ఏడాది కంటే ఈ ఏడాది ఆధాయం పెరిగిందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్స్ ఖాజామైనుద్దీన్, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ కనపరచిన గృహిణి

బుక్కరాయసముద్రం మార్చి 31 ప్రభాతవార్త

బహుమతి అందుకుంటున్న పొందిన చిన్నమ్మ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మార్చి 30,31 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి (ఎస్ఎపి) మాస్టర్స్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించడం జరిగింది.రాష్ట్రస్థాయి మహిళల మాస్టర్స్ స్పోర్ట్స్‌లో 1500 మీటర్స్ పరుగుల పోటీనందు అనంతపురం జిల్లాకు చెందిన గృహిణి టి. చిన్నమ్మ ప్రతిభకనపరచి ఈ పోటీల్లో మూడవ స్థానం కంచు బహుమతి సాదించారు. గృహణి రాష్ట్ర స్థాయి పోటీల్లో 3వ స్థానంలో గెలుపొంది బహుమతి సాదించడంతో ఆమెను పలువురు అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు సుస్మిత ఎంపిక

బుక్కరాయసముద్రం మార్చి 31 ప్రభాతవార్త

సుస్మిత

డిసెంబర్ నెలలో నెల్లూరు జిల్లా లో జరిగిన ఎస్‌జిఎఫ్ యూ 17 వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి ఈ నెల 6తేది నుండి 8వరకు భువనేశ్వర్ లో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీలకు బుక్కరాయసముద్రం మండల పరిదిలోని సిద్దరాంపురం జడ్పి హైస్కూల్ విద్యార్థిని సుస్మిత ఎంపికైంది.ఈ సందర్భంగాక్రీడా కారిణిని పాఠశాల హెచ్‌ఎం నీరజ,పిడి గట్టు నాగరాజు, నాగేంద్రప్రసాద్, కోటప్ప, బాలకృష్ణ, ఆదినారాయణ,గొప్పమ్మ,కమల, ఉమ,వెంకటలక్ష్మి,లీల,సువర్ణషబ్బీర్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గురుకుల ప్రవేశ పరీక్షల్లో పామీర్ ప్రతిభ

గార్లదిన్నె, మార్చి 31,ప్రభాతవార్త

షామీర్. వలీ

స్థానిక గార్లదిన్నె మజీద్ దగ్గరగల షాషావలీ, జుబేదా బేగంల కుమారుడు ఎస్.షామీర్ వలీ ప్రస్తుతం జరిగిన బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఇంటర్ మీడియట్ ప్రవేశ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంక్ సాధించడం జరిగింది. ఈ అబ్బాయి గార్లదిన్నె మోడల్ స్కూల్ నందు 10 వ తరగతి చదివి పరీక్షలు రాయడం జరిగింది.అలాగే కమ్యూనిటీ లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంక్‌ను పొందడం జరిగింది. బాలురలలో రాష్ట్ర స్థాయి 12వ ర్యాంక్ ను సాధించడం జరిగింది. అందుకు గార్లదిన్నె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు మామ పూలబాష కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, మార్చి 31 ప్రభాతవార్త

ఏప్రిల్ ఒకటో తేదీ నుండి జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభం అవుతాయని డివిఈవో ఎస్.వి.ఎస్ గురువయ్య శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.. ఏప్రిల్ 23వ తేదీ వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. ఆ తర్వాత వేసవి సెలవులు ఉంటాయన్నారు. జూన్ 1 నుండి కళాశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు.

CHANGE OF NAME & SURNAME

I, AIESHA BANU DASTIGIR (OLD NAME), W/o DASTIGIR ATHIULLAH, H.No.12-1-76-26A2,PRASANTH NAGAR, REVENUE WARD-12, HINDUPUR (M), SRI SATHYA SAI (DISTRICT) (A.P) hereby declare that I have changed my name & surname as **KADAKTHUR AYEESHA BANU (NEW NAME)**

CHANGE OF SURNAME

I,DASTAGIR ATHIULLAH (OLD NAME), S/o DASTIGIR WAHAB SAB, H.NO, 12-1-76-26A2, PRASANTH NAGAR, REVENUE WARD-12, HINDUPUR (M) SRI SATHYA SAI (DISTRICT) (A.P) hereby declare that I have changed my surname as **DASTIGIR ATHIULLAH (NEW NAME)**

04ATP13_04ATP13.qxd 31-03-2026 PM 10:37 Page 1

గ్రామ దేవర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత

మంత్రి సవితకు ఘన స్వాగతం పలికిన దొడగట్ట గ్రామస్తులు

నూతనంగా ఏర్పాటు చేసిన పెద్ద గువ్వలపల్లి తారు రోడ్డును చూపుతున్న మంత్రి సవిత

రొద్దం. మార్చి 31 ప్రభాత వార్త

మండల పరిధిలోని దోడగట్ట గ్రామంలో మంగళవారం గ్రామదేవర కార్యక్రమం నిర్వహించారు కలిపి సింగిల్ విండో ప్రెసిడెంట్ రామచంద్ర ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరవడం జరిగింది ఈ సందర్భంగా ఐదేళ్లకు ఓసారి జరిగే గ్రామదేవ కార్యక్రమానికి గ్రామంలోని బంధువులతో మిత్రులతో వివిధ పార్టీ నాయకులతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది మంత్రి సవిత కు రామచంద్ర వారి కుటుంబ సభ్యులు పూలమాలవేసి ఘన స్వాగతం పలికారు అనంతరం తానే స్వయంగా భోజనాలు వడ్డించడం జరిగింది తిరుగు ప్రయాణంలో పావగడ దారినుండి దొడగట్ట గ్రామం చివరి వరకు 10 కోట్ల 25 లక్షల రూపాయలతో వేసిన తారు రోడ్డును మండల నాయకులతో పరిశీలించడం జరిగింది తారు రోడ్డు పూర్తి చేసిన సందర్భంగా మంత్రి సవితకు చిన్నగువ్వలపల్లి పెద్ద గువ్వల పల్లి గోనిమేకలపల్లి రెడ్డిపల్లి దొడగట్ట రంగాపురం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నరహరి మాధవ నాయుడు చిన్నప్పయ్య వెంకటరామిరెడ్డి టైలర్ ఆంజనేయులు యు నరసింహులు శ్రీనాథ్ చౌదరి అరుణ్ కుమార్ రెడ్డి పవన్ కుమార్ వీరాంజనేయులు మండల వ్యాప్తంగా డీలర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు వివిధ కమిటీ సభ్యులు పంచాయతీ కన్వీనర్లు బూత్ కన్వీనర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపి హయాంలో సాగునీటిని సర్వనాశనం చేశారు

రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

రాయదుర్గం మార్చి 31 ప్రభాతవార్త

గత 2019 24 మధ్యలో వైసీపీ హయాంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను సర్వనాశనం చేసిందని నేడు కల్లిబల్లి మాటలతో మరోసారి నోరు పారేసుకుంటుందని రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు మంగళవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తో కలిసి కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ ను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే సీజన్లో 33 గేట్లు మార్చడం ఒక రికార్డు అన్నారు వైసిపి హయాంలో ఐదేళ్లపాటు ఒక కిలోమీటర్ కూడా మట్టి తవ్వలేదని ఒక రూపాయి కూడా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు ఒకే సీజన్లో 33 గేట్లు మార్చడం అన్నది చరిత్ర అన్నారు దీనికి కారణం రైతుల పట్ల బాధ్యత తెలిసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండడం అందుకు సహకరిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉండడం అదృష్టం అన్నారు ఈ పనులను కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని చెప్పారు ఒకే సీజన్లో 33 గేట్లు మార్చడం నిధులతో ఇబ్బందులు ఎదుర్కోలేదా అన్న మీడియా ప్రశ్నలకు ఆయనసమాధానంఇచ్చారు.

ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వం మొదట కట్ చేస్తే కర్ణాటక ప్రభుత్వం రియంబర్స్ చేస్తుందని పేర్కొన్నారు అనంతరం ఈ పనులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశస్తుందన్నారు పనులను వేగవంతంగా జరగడానికి కారణంఅధికారులకు అభినం దనలు తెలిపారు ఒకే సీజన్లో 33 గేట్లు మార్చడం రైతుల పట్ల ఉన్న అంకితభావమని మరో 50 ఏళ్ల పాటు రైతుల ఆయకట్టుకు సాగునీరు అందించడం మన బాధ్యతగా మాకు ఆనందం కలిగిస్తుందని తెలిపారు.

పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మధ్యాహ్నం భోజనం పై అసంతృప్తిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సురేంద్ర బాబు

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

కంబదూరు, మార్చి 31, ప్రభాత వార్త

కంబదూరు మండల పరిధిలోని రాళ్ళనంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత లేకపోవడంతో వంట నిర్వహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మెనూ పాటించకుండా, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. బాగా కష్టపడి చదువుకుంటేనే ఉన్నత ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడగలరని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సురేంద్రబాబు సొంత నిధులతో విద్యార్థులకు యోగ మ్యాట్లను పంపిణీ చేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ఫ్లోరింగ్, మరుగుదొడ్ల వంటగది పనులను పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . ఎమ్మెల్యే వెంట మండల విద్యాధికారులు ఉమాపతి, మదన్ మోహన్ తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జె.సి

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి , వార్డు సభ్యులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిఅర్బన్, మార్చి 31 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో మాజీ సర్పంచు చింబిలి వెంకటరమణ ఏర్పాటు చేసిన నూతన టిడిపికార్యాలయాన్ని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జె.సిఅశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరుచేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. టిడిపిమాజీ సర్పంచు చింబిలి వెంకటరమణ గన్నెవారిపల్లి కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నారన్నారు. ఆయన నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే టిడిపి కార్యాలయానికి వచ్చి తెలియజేస్తే సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీ సర్పంచుల పదవీకాలం త్వరలో ముగుస్తుందని ప్రత్యేక అధికారుల పాలన వస్తుందన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చింబిలి వెంకటరమణకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు ఎమ్మెల్యే దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి నిత్యను ప్రశంసించిన మున్సిపల్ కమిషనర్

తాడిపత్రి అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న నిత్యఅనే చిన్నారిని తాడిపత్రి మున్సిపల్‌కమిషనర్ శివరామకృష్ణ ప్రశంసించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో చిరువ్యాపారంచేస్తూ స్వయం సమృద్ధి సాధించిన మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆకార్యక్రమంలో పాల్గొన్న చిన్నారి నిత్య భారతదేశంలోని రాష్ట్రాలు వాటి రాజధానుల గురించి తడబడకుండా మైకులో చెప్పడంతో అందరూ ఆశ్చర్యానికిలోనై చిన్నారి నిత్యను ప్రశంసించారు. చిన్నారి నిత్య స్పీచ్‌కు ఫిదా అయినా మున్సిపల్ కమిషనర్ వంద రూపాయల నోటును బహుమతిగా ఇవ్వడంతో ఆయన సంతకం చేసి ఇవ్వాలని చిన్నారి కోరారు. చిన్నారి కోరిక మేరకు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ వంద రూపాయల నోటుపై తన సంతకం, చిన్నారి ప్రసంగంపై వార్త దినపత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్, ప్రసంగించిన ఫోటోను లామినేషన్ చేయించి ఫ్రేమ్ తయారు చేయించి చిన్నారి నిత్యకు మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం అందజేశారు. ఇలాంటి చిన్నారులు భవిష్యత్తులో చాలా ప్రతిభ కనబరుస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

శ్రీశైలం మల్లన్న సేవలో ఎమ్మెల్యే పరిటాల సునీత

- కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి వారి దర్శనం
- అర్చనలు అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత
- స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్ష

స్వామివారిని దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, మార్చి 31 ప్రభాతవార్త

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీశైల మల్లికార్జున స్వామి సేవలో గడిపారు. మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ముందు గా ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. మొదట ఆమె మల్లికార్జున స్వామి వారి హారతి, అభిషేక సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత స్వామివారిని స్పర్శ దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీ భ్రమ రాంబిక అమ్మవారికి కుంకుమార్చన, ఇతర పూజా కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. అర్చకులు ఎమ్మెల్యే సునీతకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీశైల మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. మల్లికార్జున స్వామి భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడుపుతారని అన్నారు. ఆలయంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు కూడా చాలా బాగున్నాయని ఎమ్మెల్యే సునీత అన్నారు.

వివాహేతర సంబంధం కారణంతో భార్యను హత్య చేసిన భర్త

గుత్తి, మార్చి 31 ప్రభాతవార్త

వివాహమై...కూతురికి పెళ్లి కూడా చేసిన వయసులో తన భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని అనుమానించిన భర్త భార్యను రాళ్లతో కొట్టి చంపిన సంఘటన మంగళవారం గుత్తి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంతకల్లు మండలం మైనాపురం గ్రామానికి చెందిన కురుబ శివలింగయ్య, భార్య కురుబ లక్ష్మీలకు నలుగురు సంతానం. శివలింగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. పెద్ద కుమార్తెకు ఇటీవల వివాహం చేశాడు. అయితే కొంతకాలంగా తన సోదరుడు ఎర్రిస్వామితో తన భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని అనుమానించాడు. పలుమార్లు ఆమెతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో పామిడి మండలం కదిరివల్లి గ్రామంలో నివాసముంటున్న తన సోదరి చంద్రమ్మ ఇంటికి తన భార్యతో కలిసి వెళ్లాడు. తదుపరి బళ్లారిలో ఒక దేవరకు హాజరయ్యేందుకు వెళదామని తన భార్యతో చెప్పి బైకుపై బయలుదేరాడు. మార్గమధ్యంలో గుత్తి మండలం పూలకుంట గ్రామ పరిసర ప్రాంతాల్లో ఓ కంకర మిషన్ వద్ద ఆమెను రాళ్లతో కొట్టి హత్య చేశాడు. సంఘటనా స్థలిని గుంతకల్లు డిఎస్పి శ్రీనివాస్, అర్బన్ సిఐ రామారావు, ఎస్ఐ సురేష్‌లు సందర్శించారు. కాగా ఈ సంఘటనలోని నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను హత్య చేసిన దృశ్యం

సంత్ సేవాలాల్ జన్మస్థలం సేవాఘడ్

- వివాదాలకు తావులేదు...ఆధారాలు ఉన్నాయని స్పష్టీకరణ
- ట్రస్ట్ అధ్యక్షులు జగన్నాథరావు

సేవాలాల్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మార్చి 31 ప్రభాతవార్త

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం గుత్తి మండలంలోని గొల్లదొడ్డి సమీపంలో ఉన్న సేవాఘడ్ అని సేవాలాల్ ట్రస్టు అధ్యక్షులు రిటైర్డ్ ఐపిఎస్ అధికారి జగన్నాథరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, తదితరులు స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి వివాదాలకు తావులేదని చారిత్రక ఆధారాలు వున్నాయని వారు పేర్కొన్నారు. కొంత మంది కర్ణాటక వాసులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మండలంలోని సేవాఘడ్‌లో మంగళవారం ట్రస్టు సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు వారు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం వారు మాట్లాడుతూ జానపద గీతాలు, బంజారా సాంప్రదాయ మౌఖిక కథలతో పాటుగా, సేవాలాల్ మహారాజ్ ఏడవతరం వారసులు డాక్టర్ రామారావు తాను రచించిన సంత్ సేవాదాస్ లీలామృత్ గ్రంథంలో సేవాలాల్ జన్మస్థలం సేవాఘడ్‌గా ప్రకటించినట్లు వారు పేర్కొన్నారు. కొంతమంది పనికట్టుకొని ఆయన జన్మస్థలం గురించి గందరగోళం సృష్టిస్తున్నారని, చారిత్రక వాస్తవాలను తెలుసుకోవాలని వారు హితవు పలికారు. ఈ సమావేశంలో ట్రస్టు సభ్యులు స్వామీజీ రాజేంద్రప్రసాద్, ఠాగూర్‌నాయక్, న్యాయవాది నిమ్మియానాయక్, డాక్టర్ శ్రీరాములునాయక్, స్థానిక బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకారుడు మైనాస్వామికి... "ఆథర్ ఆఫ్ ది ఇయర్" అవార్డు

- ప్రకటించిన చెన్నై గోల్డెన్ అచీవర్స్ సంస్థ

గోరంట్ల, మార్చి 31 ప్రభాతవార్త

చరిత్ర, శాసన పరిశోధన మరియు ఆలయ పర్యాటకానికి సంబంధించి విశేష రచనలు చేసి ప్రచురించిన చరిత్రకారుడు మైనాస్వామిని "ఆథర్ ఆఫ్ ది ఇయర్" పురస్కారంతో సత్కరించనున్నట్లు చెన్నైకు చెందిన "గోల్డెన్ అచీవర్స్ వరల్డ్ రికార్డ్స్" అనే సంస్థ ప్రకటించింది. పురస్కారం గురించి సంస్థ అధికార ప్రతినిధి భవానిశ్రీ తనకు సమాచారం పంపినట్లు మైనాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగర సామ్రాజ్య చరిత్ర సంస్కృతి కోటలు రాజభవనాలు శాసనాలు ఆలయాలు తదితర అంశాలపై విస్తృతంగా పరిశోధన సాగించడమే కాకుండా, పుస్తకాలు ముద్రిస్తూ విశేష పాఠక ఆదరణ పొందినందుకు 2026 సంవత్సరానికి గాను "ఆథర్ ఆఫ్ ది ఇయర్" పురస్కారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారని చరిత్రకారుడు వివరించారు. కాగా చరిత్ర మరియు శాసన పరిశోధనకు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని 2025లో మైనాస్వామి అందుకొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆలయ పర్యాటక వలయాల అభివృద్ధికి ప్రాథమిక నివేదికలు రూపొందిస్తూ ఆయన విశేష ప్రచారం కల్పిస్తున్నారు. మైనాస్వామి రాసిన "విజయనగర సామ్రాజ్య వైభవానికి ప్రతీక లేపాక్షి" అనే పుస్తకం తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషల్లో ప్రచురితమై అమ్మకాల్లో ప్రత్యేకతను సాధించింది. జాతీయస్థాయిలో రెండు మరియు రాష్ట్రస్థాయి పురస్కారాలు ఆరు ఇప్పటిదాకా అందుకొన్నట్లు మైనాస్వామి పేర్కొన్నారు.

అవార్డు దక్కించుకున్న మైనాస్వామి

టీబి బ్యాం వద్ద నుంచి సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసిన మంత్రి పయ్యావుల కేశవ్

- కొత్తగేట్లు బిగింపు పనులను వివరించిన మంత్రి
- గేట్ల ముగింపు పనులు పూర్తి అయితే కర్నూలు, అనంతపురం జిల్లాలకు మేలు జరుగుతుందన్న సీఎం చంద్రబాబు
- టిబి డ్యాంకు కొత్తగేట్లు బిగింపు పనులను పరిశీలించిన మంత్రి కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో

కర్ణాటకలోని హోస్పేట వద్ద తుంగభద్ర జలాశయంకు కొత్తగేట్లు అమర్చేందుకు వేగంగా జరుగుతున్న పనులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. టిబి బ్యాంకు దెబ్బతిన్న గేట్ల స్థానంలో కొత్తగేట్లు అమర్చేందుకు కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా నిధులు కేటాయించాయి. ఇందులో

తుంగభద్ర డ్యాంపై కొత్తగేట్లను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో కలిసి పరిశీలిస్తున్న దృశ్యం

భాగంగా టిబి డ్యాంకు కొత్తగేట్లను అమర్చే పనులను పరిశీలించేందుకు వెళ్లిన సందర్భంగా డ్యాం సైట్ నుంచే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి వివరించారు. డ్యాం సైట్ నుంచే కొత్తగేట్లు అమర్చే విషయం సీఎంకు ఆర్థిక మంత్రి వివరించిన సందర్భంగా గేట్ల బిగింపు ప్రక్రియ పూర్త అయ్యేందుకు ఇంకా ఎన్నిరోజులు సమయం పడుతుందని సీఎం చంద్రబాబునాయుడు అడుగగా ఏప్రిల్ నెలాఖరు నాటికి తుంగభద్ర గేట్లు బిగింపు పనులు పూర్తి కావచ్చని మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చొరవతో కర్ణాటక ప్రభుత్వం కూడా త్వరితగతిన పనులు చేపట్టిందని సీఎంకు మంత్రి కేశవ్ వివరించినట్లు సమాచారం. డ్యాంకు కొత్తగేట్లు బిగింపు పనులు పూర్తి అయితే కర్నూలు, అనంతపురం జిల్లాలకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయ పడ్డారు. సీమ జిల్లాలకు మేలు జరిగేలా తుంగభద్ర గేట్లు బిగింపు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించినందుకు ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా తుంగభద్ర డ్యాంకు కొత్తగేట్లు అమర్చే పనులను మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డ్యాం గేట్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తుంగభద్ర ఎస్ఈ నారాయణస్వామినాయక్ తదితర అధికారులు తుంగభద్ర బోర్డు అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దరోజి టన్నెల్‌ను పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్ :

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించిన తర్వాత తుంగభద్ర డ్యాం నుంచి రాయలసీమకు నీరు అందించే ప్రధానమైన తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్‌లో కిలోమీటర్ 37.700 నుంచి కి.మీ.38.502 వరకు ఉన్న 802 మీటర్ల పొడవైన దరోజి టన్నెల్‌ను పరిశీలించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇతర అధికారులతో కలిసి ట్రాక్టర్‌పై దరోజి టన్నెల్‌లోనికి వెళ్లి టన్నెల్ లోపలి భాగాన్ని పరిశీలించారు.

పరిశుభ్రత, నాణ్యత, నిర్వహణ సమయాలపై దృష్టి సారించాలి

- ఏపి అన్నా క్యాంటీన్ సిఈఓ పి.వంశీధర్

అనంతపురం మార్చి31 ప్రభాతవార్త

అన్నా క్యాంటీన్‌ల పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యతాప్రమాణాలు, నిర్వహణ సమయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపి అన్నా క్యాంటీన్ సిఈఓ పి.వంశీధర్ పర్యవేక్షణాధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశపు హాలులో నగరంతో పాటు జిల్లాలోని పురపాలక సంస్థల అన్నా క్యాంటీన్ స్థాయి సలహా కమిటి సభ్యులతో కమిషనర్ ఎం.జస్వంత రావు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా సిఈఓ వంశీధర్ మాట్లాడు తూ అన్నా క్యాంటీన్ ద్వారా అందిస్తున్న భోజనం రోజుకు ఒక వ్యక్తికి రూ.75లు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందని, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కోసం అమలు చేస్తున్నదని, పర్యవేక్షణాధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతాప్రమాణాలతో కూడిన ఆహారం అందేలా చూడాలన్నారు. ఈ స్థాయి సలహా కమిటిలో ఒక నోడల్ అధికారి, స్వర్ణ వార్డు శానిటేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్, ఎస్‌హెచ్‌జి/టిఎల్ఎఫ్‌ల నుంచి ఒకరు సభ్యులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందేనన్నారు. ప్రధానంగా అన్నా క్యాంటీన్‌లో అందజేసే ఆహారం, లబ్ధిదారులకు అందించే సేవలపై ప్రత్యేక చర్చించి కమిటి సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం పర్యవేక్షణ తప్పనిసరి అని నిర్లక్ష్యం చేయకుండా రుచి కరమైన ఆహారాన్ని అందేలా చూడాలన్నారు. కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ ప్రతి రోజూ కమిషనర్‌లు అన్నాక్యాంటీన్‌లను సందర్శిస్తూ, లబ్ధిదారులకు అందుతున్న ఆహారం నాణ్యతపై నేరుగా మాట్లాడడం చేస్తున్నామన్నాని, పరిసర ప్రాంతాలను సైతం నిరంతరం పరిశుభ్రంగా వుండేలా చర్యలు తీసుకుంటున్నామని సలహా సభ్యులకు తెలియజేశారు. ఈ సమావేశంలో అన్నా క్యాంటీన్ స్థాయి సలహా కమిటిసభ్యులతో పాటు డిఈలు సుభాస్ చంద్రబోస్, సత్యనారాయణ, అన్నా క్యాంటీన్ సూపర్‌వైజర్లు యోగేశ్వర్‌రెడ్డి, టి.ప్రభాకర్, సోమశేఖర్, ఆర్.వెంకటేష్‌నాయక్, వి.అనిల్ కుమార్, సి.శివానందరెడ్డి, వై.రవితేజ తదతరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ స్థాయి సలహా కమిటి సమావేశంలో మాట్లాడుతున్న సిఈఓ వంశీధర్

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు..!

-2025-26 ఏడాదికి గాను రూ.10.26 కోట్లు వసూలు -నీటి పన్ను రూ.2.67 కోట్లు వసూలు

గుంతకల్లు, మార్చి 31 ప్రభాతవార్త

గుంతకల్లు మున్సిపాలిటీలో రికార్డు స్థాయిలో అధికారులు ఆస్తి పన్ను వసూలు చేశారు. 2025-26 ఏడాదికి గాను అత్యధికంగా ఆస్తి పన్ను 10.26 కోట్లు వసూలైనట్లు కమిషనర్ లక్ష్మీదేవి మంగళవారం తెలిపారు. నీటి పన్ను 2.67 కోట్లు వసూలు అయింది. 2024-25లో ఆస్తిపన్ను 8.72 కోట్లు, నీటి పన్ను 1.90 కోట్లు వసూలు చేశారు. ప్రధానంగా ఈ ఏడాది ఆస్తి పన్నుపై ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీని మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. అలాగే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి బృందానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ఒక్కో ప్రాంతం అప్పజెప్పారు. అలాగే సెలవు రోజుల్లో కూడా ఆస్తి పన్ను చెల్లింపుకు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాల్లో పాల్గొని అత్యధిక పన్ను వసూళ్లలో ప్రధాన భూమిక పోషించారు. ఎక్కడెక్కడ అత్యధిక బకాయిలు ఉన్నాయో తెలుసుకుని మరీ పన్ను కట్టించారు. అధికారులను సమన్వయం చేసుకొని అధిక పన్ను వసూలు చేయడంలో ఆమె సఫలీకృతులయ్యారు. కమిషనర్‌గా లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే మున్సిపాలిటీ అభివృద్ధిలో తనదైన మార్కును చాటుకుంటున్నారు.